రేవంత్ రెడ్డి బాబు మనిషే

మొదటిపేజీ తరువాయి...

వ్యాఖ్యానించారు. కాంగ్రెస్‌కు ఓటేస్తే టీడీపీని గెలిపించడమేనని చెప్పారు. గత ఎన్నికల్లో నోటాకు వచ్చిన ఓట్లు కూడా రాని కాంగ్రెస్‌కు ఎవరైనా ఓటు వేస్తారా అని ప్రశ్నించారు. ముస్లిం రిజర్వేషన్లు రద్దు చేస్తామన్న బీజేపీతో టీడీపీ ఎలా జతకట్టిందని నిలదీశారు. మైనార్టీ రిజర్వేషన్లకు వ్యతిరేకమని చెప్పిన ఎన్డీయేలో చంద్రబాబు ఎలా కొనసాగుతున్నారని మండిపడ్డారు. పగలు బీజేపీతో, రాత్రి కాంగ్రెస్‌తో బాబు కాపురం చేస్తారని విమర్శించారు. తెలుగుదేశాన్ని గెలిపించేందుకు.. ఓట్లు చీల్చేందుకు కాంగ్రెస్ పార్టీ ఆంధ్రరాష్ట్రంలో రంగప్రవేశం చేసిందని అన్నారు. కాంగ్రెస్‌కు ఓటేస్తే.. మన కండ్లను మనం పొడుచుకున్నట్టేనని హెచ్చరించారు.

కరెంట్ షాక్‌తో రైతు మృతి

ఖమ్మం జిల్లా ఎర్రబోయినపల్లిలో విషాదం

శ్రీనివాసరావు (ఫైల్)

సత్తుపల్లి, మే 10 : వ్యవసాయ పొలానికి నీరు పెట్టేందుకు మోటర్ ఆన్ చేస్తుండగా ప్రమాదవశాత్తు విద్యుత్తు షాక్‌కు గురై ఓ రైతు మృతిచెందాడు. ఈ ఘటన ఖమ్మం జిల్లా కల్లూరు మండలం ఎర్రబోయినపల్లిలో శుక్రవారం చోటుచేసుకున్నది. గ్రామానికి చెందిన రైతు పోట్రు శ్రీనివాసరావు (50) తన ఇంటి వెనుక ఉన్న వ్యవసాయ భూమిలో పశువుల కోసం జాడు పెంచుతున్నాడు. దానికి నీరు పెట్టేందుకు మోటర్ ఆన్ చేస్తుండగా కరెంట్ షాక్‌కు గురై అక్కడికక్కడే మరణించాడు. మృతుడు శ్రీనివాసరావుకు భార్య చిట్టెమ్మ, కొడుకు కార్తీక్, కుమార్తె ప్రత్యూష ఉన్నారు. రైతు మృతితో కుటుంబ సభ్యులు కన్నీరు మున్నీరుగా విలపిస్తున్నారు.

రేవంత్‌రెడ్డికి ఈసీ నోటీసు

భాషపై 48 గంటల్లో వివరణ ఇవ్వాలని ఆదేశం

హైదరాబాద్, మే 10 (నమస్తే తెలంగాణ): బీఆర్‌ఎస్ అధ్యక్షుడు కేసీఆర్‌పై ముఖ్యమంత్రి, పీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి ఉపయోగిస్తున్న భాష, అనుచితమైన పదాలపై వివరణ ఇవ్వాలని కోరుతూ కేంద్ర ఎన్నికల సంఘం కాంగ్రెస్ పార్టీకి నోటీసులిచ్చింది. 48 గంటల్లోగా వివరణ ఇవ్వాలని శుక్రవారం ఆదేశించింది. కోడ్‌కు విరుద్ధంగా ఎన్నికల సభల్లో కేసీఆర్‌ను వ్యక్తిగతంగా దూషిస్తూ, అవమానిస్తూ రేవంత్‌రెడ్డి మాట్లాడటంపై బీఆర్‌ఎస్ పార్టీ ఎన్నికల సంఘానికి ఫిర్యాదు చేసింది. దీనిపై స్పందించిన ఈసీ కాంగ్రెస్ పార్టీ సీనియర్ ఉపాధ్యక్షుడు నిరంజన్‌రెడ్డికి నోటీసులు జారీచేసింది.

జడ్చర్ల మార్కెట్‌లో ధాన్యం కుప్పలకింద నుంచి వెళ్తున్న వర్షపునీరు

తడిసిన ధాన్యం కొనాలె

మొదటిపేజీ తరువాయి...

పాలైందని, వెంటనే తడిసిన ధాన్యాన్ని కొనాలని నిర్మల్ జిల్లాలో రైతులు ఖానాపూర్-తర్లపాడ్ ప్రధాన రహదారిపై రాస్తారోకో చేశారు. తూకం వేసిన ధాన్యాన్ని కూడా సకాలంలో తరలించడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. నిర్మల్ అదనపు కలెక్టర్ ఫోన్‌లో మాట్లాడి ఎలాంటి ఇబ్బంది లేకుండా కొనుగోలు చేస్తామని హామీనివ్వడంతో రైతులు శాంతించారు. వడ్ల కొనుగోలులో కాంగ్రెస్ ప్రభుత్వం నిర్లక్ష్యం వహిస్తున్నదని కామారెడ్డి జిల్లా బీబీపేట్ మండల కేంద్రంలోని ప్రధాన చౌరస్తా, పాల్వంచ మండల కేంద్రంలోని కామారెడ్డి-సిరిసిల్ల రహదారిపై రైతులు ధర్నా చేశారు. బీబీపేట్ సొసైటీ పరిధిలో ఇప్పటివరకు 24 వేల తడిసిన ధాన్యం బస్తాలు ఉన్నాయని, వీటిని కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. మహబూబ్‌నగర్ జిల్లా జడ్చర్లలో శుక్రవారం మధ్యాహ్నం వర్షం కురియగా, మార్కెట్‌లో ధాన్యం తడిసిపోయింది. ఉదయం మార్కెట్‌కు 3,280 క్వింటాళ్ల ఆర్‌ఎన్‌ఆర్ రకం ధాన్యం, వేరుశనగ, మొక్కజొన్న, ఆముదాలు అమ్మకానికి వచ్చాయి. ఒక్కసారిగా వాన రావడంతో ధాన్యం తడిసి ముద్దవగా.. కొంత కొట్టుకుపోయింది. ధాన్యాన్ని కాపాడుకునేందుకు రైతులు ఎన్నో పాట్లు పడ్డారు. కొందరు వరి కుప్పలపై కవర్లు కప్పగా.. మరికొందరు కవర్లు తీసుకొచ్చేలోపు ధాన్యమంతా తడిసిపోయింది. వర్షం తగ్గాక ధాన్యాన్ని రైతులు ఆరబెట్టారు.

కామారెడ్డి జిల్లా బీబీపేట్‌లో ధర్నా చేస్తున్న రైతులు, బీఆర్‌ఎస్ నాయకులు

తడిసిన ధాన్యాన్ని కొనాల్సిందే : ఎమ్మెల్యే సంజయ్ కుమార్

సారంగాపూర్, మే 10 : అకాల వర్షాల కారణంగా కొనుగోలు కేంద్రాల్లో తడిచిన ధాన్యాన్ని సర్కారు వెంటనే కొనుగోలు చేయాలని జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్ డిమాండ్ చేశారు. శుక్రవారం ఆయన జగిత్యాల జిల్లా బీర్‌పూర్ మండలంలోని కొనుగోలు కేంద్రంలో తడిసిన వరి ధాన్యాన్ని పరిశీలించి, రైతులను వివరాలు అడిగి తెలుసుకొన్నారు. ప్రభుత్వం ప్రణాళికతో ధాన్యం కొనుగోలు చేసి ఉంటే ఈ పరిస్థితి వచ్చేది కాదని పేర్కొన్నారు. ధాన్యం కొనుగోలు విషయమై జాయింట్ కలెక్టర్‌ను కూడా ఇటీవల కలిసి సమస్యలు వివరించానని చెప్పారు. రైతులు సమస్యలను తన దృష్టికి తీసుకొస్తే వారి పక్షాన నిలబడి కొట్లాడుతానని తెలిపారు. జీవన్‌రెడ్డికి ఇంకా ఎమ్మెల్సీగా ఏడాది పదవీ కాలం ఉన్నదని, ఓట్ల కోసం రైతుల కష్టాలు మరిచారని, హామీలను నెరవేర్చని కాంగ్రెస్‌కు ఓట్లతో బుద్ధి చెప్పాలని పిలుపునిచ్చారు.

జగిత్యాల జిల్లా బీర్‌పూర్ మండల కేంద్రంలోని ధాన్యం కొనుగోలు కేంద్రంలో తడిసిన వడ్లను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్

వడ్ల కుప్పపైనే ప్రాణాలు వదిలిన రైతు

- కొనుగోలు కేంద్రంలోనే గుండెపోటుతో మృతి

యాదాగౌడ్ (ఫైల్)

మిరుదొడ్డి, మే 10: వారం రోజులుగా కొనుగోలు కేంద్రం వద్దే ఉంటూ ధాన్యాన్ని ఆరపెడుతూ మరో రైతు గుండెపోటుతో కుప్పకూలాడు. ఈ విషాదకర ఘటన సిద్దిపేట జిల్లా మిరుదొడ్డిలో శుక్రవారం చోటుచేసుకున్నది. మిరుదొడ్డికి చెందిన రైతు నేరెండ్ల యాదాగౌడ్ (65)కు మూడెకరాలు ఉండగా, రెండు ఎకరాల్లో వరి, మిగతా ఎకరంలో మక్క, ఇతర పంట వేశాడు. వరిని కోసి పీఏసీఎస్ కొనుగోలు కేంద్రానికి తెచ్చాడు. తేమశాతం ఎక్కువ ఉండటంతో సెంటర్ నిర్వాహకులు కొనలేదు. దీంతో కొనుగోలు కేంద్రంలో ధాన్యాన్ని కుప్పపోసి వారం రోజులుగా ఆర పెడుతున్నాడు. శుక్రవారం వర్షం వచ్చే సూచనలు కనిపించడంతో వడ్ల కుప్పపై కవర్లను కప్పి బండరాళ్లను పెట్టాడు. అదే వడ్ల కుప్పపై గుండెపోటుకుగురై కుప్పకూలాడు. దవాఖానకు తీసుకెళ్తుండగా మార్గమధ్యంలో మృతిచెందాడు.

లోకం పోకడ

అడ్డమైన హామీలకు లొంగి ఇంకో పెళ్లి చేసుకున్నావో..!

ఎండా కాలం

	గరిష్ఠం	కనిష్ఠం
ఆదిలాబాద్	42.3°c	23.9°c
నిజామాబాద్	41.9°c	25.9°c
నల్లగొండ	41.9°c	30.1°c
రంగారెడ్డి	41.1°c	22.6°c
మెదక్	40.4°c	24.5°c
మహబూబ్‌నగర్	39.9°c	24.0°c
ఖమ్మం	39.0°c	27.0°c
కరీంనగర్	38.0°c	27.0°c
హైదరాబాద్	37.8°c	26.2°c
వరంగల్	37.0°c	27.0°c

నేడు, రేపు రాష్ట్రంలో వర్షాలు

హైదరాబాద్, మే 10 (నమస్తే తెలంగాణ): రాష్ట్రంలో శని, ఆదివారాల్లో కూడా వర్షాలు కురిసే అవకాశం ఉన్నదని హైదరాబాద్ వాతావరణ శాఖ తెలిపింది. తమిళనాడులో ఏర్పడిన ఉపరితల ద్రోణి తెలుగు రాష్ట్రాలపై చాలా బలంగా విస్తరించిందని ఆ శాఖ అధికారులు తెలిపారు. దీని ప్రభావంతో రాష్ట్రంలోని చాలా ప్రాంతాల్లో వర్షాలు కురుస్తాయని పేర్కొన్నారు. శుక్రవారం నల్లగొండ, యాదాద్రి, సూర్యాపేట, ఆసిఫాబాద్, ఖమ్మం, కొత్తగూడెం, మంచిర్యాల, మహబూబ్‌నగర్, నాగర్ కర్నూలు, హైదరాబాద్, వికారాబాద్, మేడ్చల్ జిల్లాల్లో వర్షం కురిసిందని వెల్లడించారు. శనివారం ఆదిలాబాద్, కుమ్రంభీం ఆసిఫాబాద్, మంచిర్యాల, నిర్మల్, నిజామాబాద్, జగిత్యాల, రాజన్న సిరిసిల్ల, సంగారెడ్డి, మెదక్, నారాయణపేట, జోగులాంబ గద్వాల జిల్లాల్లో అక్కడక్కడా వర్షాలు కురిసే అవకాశం ఉన్నది.

5 శాతం అధిక వర్షపాతం

రాష్ట్రంలో 2023 జూన్ 1 నుంచి మే 10 వరకు 5 శాతం అధిక వర్షపాతం నమోదైనట్టు టీఎస్‌డీపీఎస్ తెలిపింది. 2023 జూన్ 1 నుంచి 2024 మే 10 వరకు సాధారణ వర్షపాతం 899.1 మి.మీ కురవాల్సి ఉండగా, 948 మి.మీ వర్షపాతం నమోదైనట్టు వెల్లడించింది.



రాజగోపాల్‌కు చెక్కు అందజేస్తున్న పెద్దపల్లి కలెక్టర్ ముజామ్మిల్‌ఖాన్, అదనపు కలెక్టర్ శ్యాంప్రసాద్‌లాల్

ఉద్యోగుల మానవత్వం

- తోటి ఉద్యోగి కొడుకు గుండె మార్పిడి ఆపరేషన్‌కు రూ. 17.75 లక్షల ఆర్థిక సాయం

పెద్దపల్లి, మే10: పెద్దపల్లి జిల్లాలోని ఉద్యోగ, ఉపాధ్యాయులు మానవత్వాన్ని చాటారు. తోటి ఉద్యోగి కొడుకు గుండె మార్పిడి ఆపరేషన్‌కు అండగా నిలిచారు. పెద్దపల్లి జిల్లా కమాన్‌పూర్ పీహెచ్‌సీలో సీనియర్ అసిస్టెంట్‌గా పని చేస్తున్న రాజగోపాల్ కొడుకు అనుషిత్ (13) కొన్నేండ్లుగా గుండె సంబంధిత వ్యాధితో బాధపడుతున్నాడు. రెండుసార్లు శస్త్రచికిత్స చేయించినా ఆరోగ్యం కుదుటపడలేదు. దీంతో నెల రోజుల క్రితం బెంగళూరులోని ఓ ప్రైవేట్ దవాఖానలో చేర్పించారు. గుండె మార్పిడి చేయాల్సి ఉంటుందని, ఇందుకు రూ. 20 లక్షల దాకా అవసరమని వైద్యులు చెప్పారు. వారి దయనీయస్థితిని తెలుసుకున్న కలెక్టర్ ముజామ్మిల్‌ఖాన్ పిలుపుమేరకు జిల్లాలోని ఉద్యోగులు, ఉపాధ్యాయులు రూ. 17.75 లక్షలు పోగుచేశారు. శుక్రవారం కలెక్టరేట్‌లో కలెక్టర్ ముజామ్మిల్‌ఖాన్ చేతులమీదుగా ఆ చెక్కును రాజగోపాల్‌కు అందజేశారు.

రాహుల్ సభ అట్టర్‌ఫ్లాప్‌పై అంతర్మథనం

- రేవంత్‌రెడ్డి వన్‌మాన్ షోనే కారణమని సీనియర్ల గుర్రు
- పార్టీ పరువు పోయిందని అధిష్ఠానం సీరియస్

హైదరాబాద్, మే 10 (నమస్తే తెలంగాణ): హైదరాబాద్‌లో కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ సభ అట్టర్ ఫ్లాప్ కావడంపై పార్టీ అధిష్ఠానం సీరియస్ అయినట్టు సమాచారం. దీనికి పీసీసీ అధ్యక్షుడు, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఒంటెద్దు పోకడలే కారణమని సీనియర్లు మండిపడుతున్నారు. సభ సక్సెస్ అయితే అది తన క్రెడిట్‌గా, సక్సెస్ కాకపోతే పార్టీ ముఖ్య నేతల సహాయ నిరాకరణగా చిత్రీకరిస్తూ అధిష్ఠానం ముందు తమను బద్నాం చేస్తున్నారని సీనియర్లు వాపోతున్నారు. పార్టీ టికెట్లు ఇచ్చేటప్పుడు తమతో సంప్రదించకుండా ఏకపక్షంగా బలహీనమైన అభ్యర్థులకు ఇప్పించి, వారి వైఫల్యాన్ని తమపైకి నెడుతున్నారని సీనియర్లు మండిపడుతున్నారు.

వైఫల్యాన్ని మాపై రుద్దే ప్రయత్నం

రాహుల్‌గాంధీ పాల్గొన్న సరూర్‌నగర్ సభకు జన సమీకరణ బాధ్యతను మల్కాజిగిరి, చేవెళ్ల, భువనగిరి అభ్యర్థులే చూసుకుంటారని తమకు చెప్పి, వారు విఫలమైతే ఆ నెపాన్ని తమపై మోపితే ఎలా అని సీనియర్ నేతలు ప్రశ్నిస్తున్నారు. కీలకమైన ఎన్నికల సమయంలో సీఎం రేవంత్‌రెడ్డి వన్‌మాన్ షో వల్ల జరుగుతున్న పరిణామాలను అధిష్ఠానం దృష్టికి తీసుకెళ్లడం సబబు కాదని తాము మౌనం పాటిస్తుండగా, ఆయనేమో తమను అధిష్ఠానం వద్ద బలహీనపరచడానికి ఏ అంశాన్నీ వదిలిపెట్టడం లేదని సీనియర్లు మండిపడుతున్నారు.

వారికి టికెట్ ఇప్పించింది ఎవరు?

రాహుల్‌గాంధీ సభకు జన సమీకరణ చేయాల్సిన చేవెళ్ల అభ్యర్థి రంజిత్‌రెడ్డి, మల్కాజిగిరి అభ్యర్థి పట్నం సునీతా మహేందర్‌రెడ్డి, భువనగిరి అభ్యర్థి చామల కిరణ్‌కుమార్‌రెడ్డి వైఫల్యం కారణం కాదా? ఈ ముగ్గురికి టికెట్లు ఇప్పించింది ఎవరు? రేవంత్‌రెడ్డి కాదా? అలాంటప్పుడు ఆ తప్పిదాన్ని తమపైకి ఎలా నెడతారని సీనియర్లు ప్రశ్నిస్తున్నారు. వీరిలో సునీతా మహేందర్‌రెడ్డి, రంజిత్‌రెడ్డి ఎన్నికల నోటిఫికేషన్ వచ్చిన తరువాత కాంగ్రెస్‌లో చేరారని, అలాంటప్పుడు క్షేత్రస్థాయిలో పార్టీ శ్రేణుల్లో స్పందన ఎలా వస్తుందని ప్రశ్నిస్తున్నారు. పార్టీలో ఎంతో మంది సమర్థులైన నాయకులు ఉండగా, వారిని కాదని ఎన్నికల ముందు బయటి నుంచి వచ్చిన వారికి టికెట్లు ఇచ్చిందెవరు? సభ ఫెయిల్యూర్‌కు తామెలా కారణం అవుతామని ప్రశ్నిస్తున్నారు. పార్టీ నేతలను పక్కన పెట్టి బయటి నుంచి వచ్చిన వారిని అభ్యర్థులుగా తమపై రుద్దితే టికెట్ ఆశించిన నాయకులు కానీ, పార్టీ అధికారంలో లేకపోయినా నష్టనష్టాలు భరించి మొదటి నుంచి పార్టీనే నమ్ముకున్నవారు కానీ మనస్ఫూర్తిగా పని చేస్తారా? తప్పులన్నీ సీఎం రేవంత్‌రెడ్డి వన్‌మాన్ షోగా నడుపుకుంటూ, అధిష్ఠానం ముందు తమను దోషులుగా నిలబెడుతామంటే ఎలా? అని పార్టీలో అంతర్మథనం మొదలైంది. పారాచ్యూట్ నేతలకు టికెట్లు ఇవ్వద్దని, భవిష్యత్తులో పార్టీకి నష్టం జరుగుతుందని చెప్పినా వినిపించుకున్నారా? అని ప్రశ్నిస్తున్నారు.

ధృతరాష్ట్రునిగా మారిన అధిష్ఠానం

రేవంత్‌రెడ్డి వన్‌మాన్ షో వల్ల పార్టీకి జరుగుతున్న నష్టాన్ని అధిష్ఠానం దృష్టికి తీసుకెళ్లేందుకు ప్రయత్నించినా వినిపించుకోవడం లేదు. రేవంత్‌రెడ్డి చెప్పిందే అధిష్ఠానం వింటున్నది తప్ప తాము చెప్పేది వినిపించుకోవడం లేదని కీలక నేతలు సైతం వాపోతున్నట్టు తెలిసింది. అయినప్పటికీ, కొందరు ముఖ్య నేతలు అధిష్ఠానం దృష్టికి తీసుకెళ్తే, ఎన్నికల ఖర్చులకు డబ్బులు సమకూర్చే సత్తా మీకు ఉన్నదా? అని ప్రశ్నించడంతో తాము మారుమాట్లాడలేక పోతున్నామని చెప్తున్నారు. 'పార్లమెంట్ ఎన్నికలు ముగిసే వరకు దేనినీ వినదలుచుకోలేదు.. పట్టించుకోం' అని అధిష్ఠానమే తెగేసి చెప్పడంతో రేవంత్‌రెడ్డి ఆడిందే ఆట...పాడిందే పాటగా వన్ మాన్‌షో సాగుతున్నదని ఒక సీనియర్ నాయకుడు ఆవేదన వ్యక్తంచేశారు.

తెలంగాణలో ట్రిపుల్ ఆర్ ట్యాక్స్

- ఐదు నెలల్లోనే కాంగ్రెస్ అవినీతి
- ఎక్కడా పేరు ప్రస్తావించకున్నా భుజాలు తడుముకుంటున్న సీఎం
- హిందువులను మైనార్టీలుగా మార్చే కుట్ర
- హైదరాబాద్, నారాయణపేట సభల్లో ప్రధాని మోదీ



హైదరాబాద్/నారాయణపేట, మే 10 : 'తెలంగాణలో అధికారంలోకి వచ్చిన ఐదు నెలల్లోనే కాంగ్రెస్ అవినీతి మొదలు పెట్టింది. కేంద్రం ఇచ్చే నిధులను ఏటీఎంలా మార్చుకున్నది. గల్లీస్థాయిలో వసూలు చేస్తున్న ఆర్‌ఆర్ ట్యాక్స్‌ను ఢిల్లీ నేతలకు పంపుతున్నది. తాజాగా ఇక్కడ ఆర్‌ఆర్‌ఆర్ ట్యాక్స్ కూడా మొదలైంది. మూడో ఆర్ అంటే రజాకార్ ట్యాక్స్' అని కాంగ్రెస్‌పై ప్రధాని నరేంద్రమోదీ దుమ్మెత్తిపోశారు. పార్లమెంట్ ఎన్నికల్లో భాగంగా, నారాయణపేట జిల్లా కేంద్రం, హైదరాబాద్‌లోని ఎల్బీ స్టేడియంలో నిర్వహించిన సభల్లో ఆయన మాట్లాడారు. ఆర్‌ఆర్ ట్యాక్స్‌పై ఇప్పటికే ఢిల్లీలోనూ చర్చ నడుస్తున్నదని, తాను ఎవరి పేరు చెప్పకుండా ఆర్‌ఆర్ ట్యాక్స్ అంటే కాంగ్రెస్ ముఖ్యమంత్రి మాత్రం భుజాలు తడుముకుంటూ విలేకరుల ముందుకొచ్చి ఈ విషయంపై అవాకులు చెవాకులు పేలుతున్నారంటే ఆ ట్యాక్స్ ఎవరు వసూలు చేస్తున్నారో స్పష్టమవుతున్నదని చెప్పారు. ఈ విషయాన్ని ప్రజలు గమనించాల్సిన అవసరం ఎంతో ఉందని నొక్కి చెప్పారు. కాంగ్రెస్‌లో ఉన్న రాకుమారుడు ఎన్నికల ముందు మొహబ్బత్ తీసుకొచ్చి దేశాన్ని ముక్కలు చేసేందుకు ప్రయత్నిస్తున్నాడని ఆరోపించారు. అమెరికాలో ఉంటున్న రాకుమారుడి గురువు శ్యాం పిట్రోడా దేశ ప్రజలను ఆఫ్రికన్లుగా, నల్ల చర్మం గల వారిగా హేళన చేసి మాట్లాడుతున్నారని, దేశంలోని హిందువులను మైనార్టీలుగా మార్చేందుకు కాంగ్రెస్ ప్రయత్నిస్తున్నదని విమర్శించారు. హిందువులన్నా, హిందూ పండుగలన్నా కాంగ్రెస్‌కు వ్యతిరేకమని దుయ్యబట్టారు. ధర్మం, మతం ఆధారంగా రిజర్వేషన్లు ఇవ్వడానికి వీలులేదని కాంగ్రెస్‌కు తెలిసినా బీసీ, ఎస్సీ, ఎస్టీ రిజర్వేషన్లు ఆపి ముస్లింలకు ఇచ్చేందుకు ఆ పార్టీ ప్రయత్నిస్తున్నదని ఆరోపించారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో ముస్లింలకు ఏవిధంగా రిజర్వేషన్ ఇచ్చేందుకు ప్రయత్నించిందో అదేవిధంగా దేశవ్యాప్తంగా ఇచ్చేందుకు ప్రయత్నిస్తున్నదని చెప్పారు. ముస్లిం రిజర్వేషన్ల విషయంలో శక్తివంచన లేకుండా కృషి చేస్తున్న కాంగ్రెస్, మాదిగల విషయంలో ఎందుకు మాట్లాడడం లేదని ప్రశ్నించారు. ఉమ్మడి పౌరస్మృతిని (యూనిఫాం సివిల్‌కోడ్)ను వద్దన్నవారు, ఆర్టికల్ 370 రద్దును వ్యతిరేకించినవారు జూన్ 4తర్వాత పారిపోక తప్పదని ఎద్దేవా చేశారు. దేశాన్ని లూటీ చేయడం, వారసత్వ రాజకీయాలు చేయడంలో కాంగ్రెస్‌ది ట్రాక్ రికార్డు అని, ఆ పార్టీ పాలనలో ఎన్నోచోట్ల బాంబు పేలుళ్లు జరిగాయని, ఎక్కడికెళ్లాలన్నా భయపడాల్సి వచ్చేదని విమర్శించారు.

హైదరాబాద్ రెండో రాజధాని అయితే సంతోషమే

- మోదీ, అమిత్‌షాకు భయం పట్టుకున్నది
- మా ప్రభుత్వానికి ఢోకా లేదు
- హైదరాబాద్‌లో మీడియాతో ఖర్గే



మల్లికార్జున ఖర్గే

హైదరాబాద్, మే 10 (నమస్తే తెలంగాణ): దేశానికి హైదరాబాద్ రెండో రాజధాని అయితే సంతోషిస్తానని ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే మీడియా అడిగిన ఒక ప్రశ్నకు సమాధానంగా చెప్పారు. తనకు తిరగడానికి ఢిల్లీ కంటే హైదరాబాద్ దగ్గరవుతుందని వ్యాఖ్యానించారు. హైదరాబాద్‌ను రెండో రాజధాని చేయాలని అంబేద్కర్ ప్రతిపాదించారని గుర్తుచేశారు. పార్లమెంట్ ఎన్నికల ప్రచారానికి శుక్రవారం హైదరాబాద్‌కు వచ్చిన మల్లికార్జున్ ఖర్గే హోటల్ తాజ్‌కృష్ణాలో మీడియాతో మాట్లాడుతూ.. తెలంగాణాలో కాంగ్రెస్ ప్రభుత్వానికి ఎలాంటి ఇబ్బంది లేదని, ఐదేండ్లు పూర్తికాలం ఉంటుందని పేర్కొన్నారు. కొన్ని పార్టీలు దుష్ప్రచారం చేస్తున్నాయని విమర్శించారు. అసెంబ్లీ ఎన్నికల్లో హామీ ఇచ్చిన ఆరు గ్యారెంటీల్లో ఐదింటిని అమలు చేస్తున్నట్టు చెప్పారు. ఎన్నికల కోడ్ ముగిసిన తరువాత మిగతా హామీలను అమలు చేస్తామని తెలిపారు.

తెలంగాణకు బీజేపీ ఏమిచ్చింది?

కాంగ్రెస్ పార్టీ తెలంగాణకు ఏమి ఇచ్చిందో చెప్పడానికి అనేకం ఉన్నాయని, మరి కేంద్రంలో పదేండ్లపాటు అధికారంలో ఉన్న బీజేపీ ఏమిచ్చిందో ప్రధాని మోదీ చెప్పగలరా? అని ఖర్గే ప్రశ్నించారు. కాంగ్రెస్ నిర్మించిన ప్రాజెక్టులు తప్ప ఒక్కటైనా బీజేపీ ఇచ్చిందా? కనీసం జాతీయహోదా అయినా ప్రకటించిందా? అని నిలదీశారు.

అదానీ, అంబానీల డబ్బులు తరలిస్తుంటే చోద్యం చూస్తున్నారా?

అదానీ, అంబానీల డబ్బు వ్యాన్లలో తరలిస్తుంటే ప్రధాని మోదీ ఎందుకు పట్టుకోవడం లేదని ఖర్గే మండిపడ్డారు. కాంగ్రెస్ పార్టీకి అదానీ, అంబానీల డబ్బులు తరలించడవల్లనే రాహుల్ గాంధీ వారి గురించి మాట్లాడటం లేదంటూ ప్రధాని మోదీ చేసిన వ్యాఖ్యలను తీవ్రంగా ఖండించారు. అబద్ధాలు ప్రచారం చేయడంలో మోదీకి మించిన వారు లేరని మండిపడ్డారు. ఖర్గే అల్లుడు రూ.400 కోట్ల కుంభకోణం ఆరోపణలపై స్పందిస్తూ, అందులో నిజముంటే జైల్లో వేయండని సూచించారు.

ఓటమి భయంలో జీవన్‌రెడ్డి

- ఎమ్మెల్యేగా ఓడించారు.. ఎంపీగా నైనా గెలిపించండి
- ఓటర్లను ప్రాధేయపడుతున్న నిజామాబాద్ పార్లమెంట్ కాంగ్రెస్ అభ్యర్థి



జీవన్‌రెడ్డి

సారంగాపూర్, మే10: నిజామాబాద్ పార్లమెంట్ కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి టీ జీవన్‌రెడ్డి ఓటమి భయంలో పడ్డారు. తాను పార్లమెంట్ ఎన్నికల్లో గెలిచే అవకాశాలు లేవని తెలుసుకున్న జీవన్‌రెడ్డి ప్రజలను నమ్మించేందుకు నానాయాతన పడుతున్నారు. 'నేను ఏం తప్పుచేసిన, నాకెందుకీ శిక్ష, ఎన్నికల్లో కొట్లాడి అలసిపోయిన, ఎమ్మెల్యేగా ఓడించారు. ఎంపీగా నైనా గెలిపించండి' అని ఓటర్లను వేడుకుంటున్నారు. శుక్రవారం జగిత్యాల జిల్లా బీర్‌పూర్, సారంగాపూర్ మండలాల్లోని ఆయా గ్రామాల్లో ఎన్నికల ప్రచారంలో జీవన్‌రెడ్డి మాట్లాడుతూ ఎమ్మెల్యేగా గెలిస్తే ఉన్నత స్థానంలో ఉండే అవకాశం వచ్చేది, ఎంపీగా పోటీ చేసే పరిస్థితి వస్తుందనుకోలేదు, మళ్లీ ఓటు సూత్తనో సూడనో అంటూ ప్రజలనుద్దేశించి భావోద్వేగంగా మాట్లాడారు. తనను గెలిపిస్తే ఆరు గ్యారెంటీలు పూర్తిస్థాయిలో అమలు చేయిస్తానని మరోసారి హామీ ఇచ్చారు. తనకు ఇవే చివరి ఎన్నికలంటూ మళ్లీ ప్రజలను నమ్మించేందుకు ప్రయాసపడ్డారు.

పాలమూరు చీడపురుగు డీకే అరుణ

జనజాతర సభల్లో సీఎం రేవంత్‌రెడ్డి

మక్తల్ టౌన్, మే 10 : 'పాలమూరును పట్టి పీడించిన చీడపురుగు డీకే అరుణ. కల్తీకల్లు, దొంగసారా అమ్ముకున్న, కంకర కొల్లగొట్టిన, కాంట్రాక్టర్ల దగ్గర కమీషన్లు దండుకున్న డీకే అరుణను మోదీ పక్కన కూర్చోబెట్టుకొని అవినీతి గురించి మాట్లాడడం విడ్డూరంగా ఉంది' అని సీఎం రేవంత్‌రెడ్డి దుయ్యబట్టారు. నారాయణపేట జిల్లా మక్తల్ మున్సిపాలిటీ పరిధి కొత్తగార్లపల్లి, మహబూబ్‌నగర్ జిల్లా షాద్‌నగర్‌లో శుక్రవారం నిర్వహించిన జనజాతర సభల్లో రేవంత్ మాట్లాడుతూ గద్వాల బంగ్లా రాజకీయాల నుంచి వచ్చిన డీకే అరుణకు రాజకీయ భిక్ష పెట్టిందే కాంగ్రెస్ అని చెప్పారు. జడ్పీటీసీ మొదలు ఉమ్మడి రాష్ట్రంలో మంత్రిగా ఆమె రాజకీయంగా ఎదిగేందుకు కాంగ్రెస్ అనేక అవకాశాలు కల్పించిందని తెలిపారు. స్వలాభం కోసమే డీకే అరుణ బీజేపీలో చేరి పాలమూరు పార్లమెంట్ బరిలో నిలిచిందని, కాంగ్రెస్‌ను ఎదగనీయొద్దనే అక్కసుతో ఉందని ఆరోపించారు. హైదరాబాద్ ఖ్యాతి అంతర్జాతీయంగా పెరిగిందని, దాన్ని తగ్గించేందుకు బీజేపీ కుట్ర చేస్తున్నదని విమర్శించారు.

వైఎస్ నిజమైన వారసురాలు షర్మిలే

హైదరాబాద్, మే 10 : మాజీ ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డికి నిజమైన వారసురాలు వైఎస్ షర్మిలే అని, ఆయన ఆశయాలకు అనుగుణంగా ముందుకుపోతున్నందునే ఆమెకు ఏపీ పీసీసీ అధ్యక్ష పదవిని కాంగ్రెస్ అధిష్ఠా నం అప్పగించిందని సీఎం రేవంత్‌రెడ్డి చెప్పారు. హైదరాబాద్‌లోని హోటల్ తాజ్‌కృష్ణలో శుక్రవారం నిర్వహించి న 'మీట్ ది ప్రెస్'లో సీఎం మాట్లాడుతూ పార్టీ ఆదేశా ల మేరకే షర్మిల ఎన్నికల బరిలో నిలిచారని వివరించారు. రాజ్యాంగం, రిజర్వేషన్లమీద మాట్లాడినందుకే మోదీ, అమిత్ షా టార్గెట్ చేసి క్రిమినల్ కేసు పెట్టించారని, 200మంది ఢిల్లీ పోలీసులను దింపారని ఆరోపించారు.

ప్రభుత్వాన్ని కూల్చడం బీజేపీ తరం కాదు

- 'మీట్ ది ప్రెస్'లో మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి

హైదరాబాద్, మే 10 (నమస్తే తెలంగాణ) : 'ప్రజాస్వామ్యబద్ధంగా ఎన్నికైన ప్రభుత్వాలను కూల్చ డం బీజేపీకి అలవాటు. ఇప్పటికే ఎన్నో ప్రభుత్వాలను కూల్చింది. కానీ, తెలంగాణలో మా ప్రభుత్వాన్ని కూల్చడం బీజేపీ తరంకాదు. ఇక్కడ ఆ పార్టీ ఆటలు సాగవు' అని మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి హెచ్చరించారు. టీయూడబ్ల్యూజే (ఐజేయూ) రాష్ట్ర అధ్యక్షుడు విరాహత్ అలీ అధ్యక్షతన బషీరాబాగ్ ప్రెస్‌క్లబ్‌లో శుక్రవారం నిర్వహించిన 'మీట్ ది ప్రెస్'లో ఉత్తమ్ ఇష్టాగోష్ఠిగా మాట్లాడారు. తాము క్రికెట్ టీమ్ లా పటిష్టంగా ఉన్నామని తెలిపారు. 'బీఆర్‌ఎస్ నుం చి ఎంతో మంది కాంగ్రెస్ లో చేరారు, ఎన్నికల తర్వా త ఏం జరుగుతుందో మీరే చూస్తారు' అని చెప్పారు. రాష్ట్ర ఆదాయం, వనరులను పెంచుకోవడం కోసం ప్రభుత్వానికి ప్రతిపాదనలు ఇచ్చేందుకు డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రి శ్రీధర్‌బాబు, తనతో కలిపి క్యాబినెట్ సబ్ కమిటీ ఏర్పాటైందని చెప్పారు.

పాకిస్థాన్, రష్యా, నార్త్ కొరియాలా ఇండియా

మోదీ మళ్లీ ప్రధాని అయితే ఇండియా కూడా పాకిస్థాన్, రష్యా, నార్త్ కొరియాలా తయారవుతుందని ఉత్తమ్ అభిప్రాయపడ్డారు. పార్లమెంట్ వ్యవస్థను మోదీ ప్రభుత్వం ధ్వంసం చేసిందని చెప్పారు.